పచ్చని పొలాల్లో..
ఇథనాల్ చిచ్చు

- అనుమతులిచ్చిన ప్రజాప్రతినిధులు
- ఫ్యాక్టరీ వద్దంటున్న స్థానికులు
- ఆందోళనలో మూడు గ్రామాల రైతులు

7లో



కేసీఆర్, హరీశ్‌రావుకు కాంగ్రెస్ సత్తా చూపిస్తాం

- మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
- మెదక్ ఎన్నికను ఛాలెంజ్‌గా తీసుకున్నాం
- రుద్రారంలో ప్రచార వాహన ప్రారంభోత్సవంలో మంత్రి కొండా సురేఖ



పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్‌గడ్డ వద్ద నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, వేదికపై మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు తదితరులు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీశ్‌రావులకు కాంగ్రెస్ సత్తా చూపిస్తామని అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల ప్రచార రథాలను శుక్రవారం రుద్రారం గణేష్ దేవస్థానం వద్ద మంత్రి జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిథ్యం వహిస్తున్న మెదక్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ ఛాలెంజ్‌గా తీసుకున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కష్టపడాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో నమ్మకంతో మెదక్ ఎంపీ అభ్యర్థిని గెలిపించే బాధ్యతను తనకు అప్పగించారన్నారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా పని చేసి మెదక్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. రేపటి నుంచి తమ పార్టీ ప్రచారం ముమ్మరం కానున్నదని, పార్టీ అభ్యర్థి నీలం మధు గెలుపునకు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి, సంబురాలు జరుపుకునేందుకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలను మంత్రి సురేఖ ఉత్సాహ పరిచారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే పోటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ మెదక్ కాంగ్రెస్ అడ్డా అని, మరోసారి నిరూపించేందుకు కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీసీకి అరుదైన అవకాశం దక్కిందని, మిగతా అభ్యర్థులు ఇద్దరు కూడా అగ్రకులాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ గెలిచిన మెదక్ గడ్డపై తిరిగి కాంగ్రెస్ జెండాను ఎగురవేయబోతున్నామన్నారు. అందువల్ల మెదక్ సీటుపై కాంగ్రెస్ జెండా ఎగిరేసేంతవరకు నిద్రపోయేది లేదన్నారు. ఊహించని విధంగా భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని మైనంపల్లి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ పటాన్‌చెరు అసెంబ్లీ ఇన్‌చార్జి శ్యామ్ గౌడ్, పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్, మున్సిపల్, పట్టణ, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

దుద్దెడ చెరువు ప్రాంతంలో ఏడు నెమళ్లు మృతి

కొండపాక, ఏప్రిల్ 12: కొండపాక మండలం దుద్దెడ నల్లచెరువు ప్రాంతంలో అనుమానాస్పదంగా ఏడు నెమళ్లు మృతి చెందాయి. శుక్రవారం పశువులకు నీరు తాగించడానికి వెళ్లిన ఓ రైతుకు నల్లచెరువు సమీపంలో నెమళ్లు పడిపోయి ఉండడాన్ని గమనించాడు. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఫారెస్ట్ బీట్ అధికారి చందు అక్కడికి చేరుకుని నెమళ్లను పరిశీలించగా అప్పటికే ఆరు మృతిచెందాయి. ఒకటి అస్వస్థతకు గురైంది. దానిని దుద్దెడ వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి ఆ నెమలి కూడా మృతిచెందింది. ఫారెస్ట్ అధికారులు పంచనామ నిర్వహించి చనిపోయిన నెమళ్లను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి పూడ్చిపెట్టారు. పంటపొలాల్లో వేసిన విషపు గుళికల నీటిని తాగడం వల్ల నెమళ్లు చనిపోయాయా? లేదంటే ఎవరైనా విషపు గుళికలు చల్లి ఉంటారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



దుద్దెడ చెరువు వద్ద పడి ఉన్న నెమళ్లు



అస్వస్థతకు గురైన నెమలికి చికిత్స అందిస్తున్న దృశ్యం



కల్లంలోని ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు

కమ్ముకొస్తున్న మబ్బులు..


ఆందోళనలో రైతులు

- వర్షం భయానికి పచ్చివరినే కోస్తున్నవైనం
- టార్పాలిన్ల కోసం తప్పని తిప్పలు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 12 : పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో భూగర్భజలాలు అడుగంటి ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డ రైతులు ఇప్పుడు కమ్ముకుంటున్న కారుమబ్బులతో ఆందోళన చెందుతున్నారు. వాతావరణశాఖ రానున్న ఐదురోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో కొందరు రైతులు పచ్చివరినే కోస్తున్నారు. ఇంకొందరు రైతులు పచ్చివరిని తక్కువ ధరకు దళారులకు విక్రయిస్తున్నారు. కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని అధికారులు ఆలస్యం చేయకుండా త్వరగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. గురువారం రాత్రి హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కారు మబ్బులు కమ్ముకోవడంతో పాటు చినుకులు పడడంతో రైతులు కల్లాలోని ధాన్యం కుప్పలపై టార్పాలిన్లను కప్పి రాత్రంతా అక్కడే జాగరం చేశారు. అయితే టార్పాలిన్ల కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు.



వర్షం భయానికి గాంధీనగర్‌లో పచ్చిగా ఉన్న వరిని మిషన్‌తో కోయిస్తున్న దృశ్యం



హుస్నాబాద్ మండలంలో కమ్ముకొస్తున్న మబ్బులు

పచ్చి వరినే కోయిస్తున్నా



ఇంకా పదిరోజులకు కోయాల్సిన వరిని అకాల వర్షాల భయంతో పచ్చివరినే కోయిస్తున్నా. అకాల వర్షాలు, వడగళ్లకు పంట మొత్తం దెబ్బతింటుదనే భయంతో కోత మొదలుపెట్టా. మొత్తం నష్టపోయి బాధపడే కంటే ఉన్నదానితో తృప్తి చెందడం మేలు. కనీసం పెట్టుబడి వచ్చినా చాలనే ఉద్దేశంతో వరి పచ్చిగ ఉన్నా కూడా కోయక తప్పడం లేదు.

\- గద్ద సంపత్, గాంధీనగర్



బ్రాండెడ్

మాయాజాలం!

- నాసిరకమైన బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి విక్రయం..
- ఇష్టారీతిన ధరలు పెంచి అమ్మకాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ!!

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 12: సన్నబియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. వ్యాపారులు వివిధ రకాల బ్రాండ్ల పేరిట ధరలు పెంచి విక్రయిస్తున్నారు. నాసిరకమైన బియ్యాన్ని నాణ్యమైన బియ్యంగా రంగురంగు సంచుల్లో నింపి విక్రయిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏవి నాణ్యమైన బియ్యమో వండి తింటే తప్ప తెలియని పరిస్థితి. ఈ తరుణంలో పట్టణాల్లో నివసించే సామాన్య, మధ్యతరగతి వారు బియ్యం కొనాలంటేనే జంకుతున్నారు. రోజురోజుకు ఇష్టానికి పెంచుతున్న ధరలను నియంత్రించాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కానరాని పర్యవేక్షణ

బియ్యం అమ్మకాల్లో వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు రంగురంగుల సంచుల్లో 25 కిలోల చొప్పున ప్యాకింగ్ చేసి అమ్ముతున్నారు. పైగా వివిధ బ్రాండ్ల పేరిట వివిధ రకాల పేర్లను సంచులపై ముద్రించి వినియోగదారులకు అంటగడుతున్నారు. జిల్లాలో వందల సంఖ్యలో రైస్ డిపోలు ఉన్నాయి. అయితే వాటిలో చాలా వాటికి అనుమతులు లేవని సమాచారం. ఇక హోల్ గ్రామ్ ఉన్న బియ్యం బ్రాండ్‌లు ఒక్కటి కూడా లేవు. బ్రాండ్ పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్నవి కూడా లేవు. నిబంధనల ప్రకారం బియ్యం సంచులపై ధర, ప్యాకింగ్ తేదీ, కంపెనీ వివరాలు, చిరునామా ముద్రించాలి. కానీ చాలా వరకు అవేవి లేకుండానే విక్రయిస్తున్నారు.



కేంద్ర ప్రభుత్వం బియ్యంపై విధించిన 5శాతం పన్నును ఎత్తివేసిన తర్వాత క్వింటాకు రూ.500 తగ్గాలి. కానీ.. ఏటా ధరలు పెరుగుతున్నాయే తప్ప ఏ మాత్రం తగ్గడం లేదు. గతేడాది వానాకాలంలో సన్నరకం వరికి క్వింటాకు రూ.2300-2500 ధర పలికింది. క్వింటా ధాన్యాన్ని మరాడించి బియ్యంగా మారిస్తే 60 నుంచి 65 కిలోలు వస్తాయి. మరో అయిదారు కిలోల నూకతో పాటు తౌడు వస్తుంది. ఈ లెక్కన చూస్తే క్వింటా బియ్యం రూ. 4 వేల లోపే ఉండాలి. కానీ మార్కెట్‌లో రూ.5వేల నుంచి మొదలై బ్రాండెడ్ పేరిట రూ. 6వేల వరకు విక్రయిస్తున్నారు. పైగా 25 కిలోలు ఉన్నట్లు సంచులపై ముద్రించి వినియోగదారులకు అంటగడుతుండగా తూకం వేస్తే 24 కిలోలే ఉంటున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ధరల నియంత్రణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటం, తనిఖీలు లేకపోవడం వల్లే వ్యాపారులు ఇష్టారీతిన ధరలు పెంచేసి అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి.

అమాంతం పెరిగిన ధరలు

జిల్లాలో సుమారు 10.50 లక్షల పైగానే జనాభా ఉంది. అందరికీ కలిపి నెలకు సగటున సుమారు లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. దాదాపు 60శాతం పైగానే కుటుంబాలు బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాయి. అంటే నెలకు సగటున 60 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం. గతేడాది జనవరిలో కొత్త రకం బియ్యం క్వింటా ధర రూ. 3,200 నుంచి రూ. 3400 చొప్పున విక్రయించారు. అక్టోబరు నుంచి క్వింటా రూ.4,500 నుంచి రూ. 5వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఒకేసారి రూ.1300 నుంచి రూ.1800 పెంచారు. ఇక పాత బియ్యం రూ.4,500 చొప్పున లభించగా ఇప్పుడు రూ.5,500 నుంచి రూ. 6,200 చొప్పున విక్రయిస్తున్నారు. మరోవైపు నిల్వలు తక్కువగా ఉండడంతో ధరలు మరింత పెరగవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. ధరల నియంత్రణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఓ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా బియ్యం బస్తాలు

'తెల్ల'బోయిన కరెంటు బిల్లు

- బిల్లింగ్ మిషన్‌లో ఇంక్ అరిపోయి ప్రింట్ పడటం లేదట..
- ప్రింట్ సరిచూడకుండా బిల్లుల పంపిణీ
- ఎంత కట్టాలో తెలియక వినియోగదారుల్లో గందరగోళం

పటాన్‌చెరు, ఏప్రిల్ 12: చిన్నపాటి నిర్లక్ష్యం విద్యుత్ వినియోగదారుల సహనానికి పరీక్ష పెడుతోంది. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం సిటిజన్‌కాలనీలో ఈ నెల ట్రాన్స్‌కో బిల్‌కలెక్టర్లు పంపిణీ చేసిన బిల్లుల్లో అంకెలు కనిపించకుండా కేవలం తెల్లకాగితాలు వినియోగదారులకు చికాకు పుట్టించింది. ప్రతీ నెల మీటర్ చెక్ చేసి స్పాట్ బిల్లింగ్ మిషన్(ఎస్‌బీఎం) ద్వారా రీడింగ్ తీసి కరెంటు బిల్లులను పంపిణీ చేస్తారు. తీసిన బిల్లుల్లో అంకెలు పడుతున్నాయా లేదా అని కూడా చూడకుండా మొక్కుబడిగా ఇళ్ల గేట్లకు, తలుపు గడియలకు తగిలించి వెళ్లిపోయారు. అయితే, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ద్వారా మీటర్ల రీడింగ్, బిల్లుల జారీ జరుగుతోంది. వేసవి కావడంతో బిల్లింగ్ మిషన్‌లో ఇంక్ తడి ఆరిపోయి ప్రింట్ పడటం లేదు. కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతోంది. అనేకమార్లు చెప్పినా స్పందన కరువు కావడంతో కాలనీవాసులు విసుగుచెందారు. తెల్లకాగితం బిల్లులో ఎన్ని యూనిట్ల విద్యుత్ వినియోగించామో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్‌లో చెక్ చేసుకుంటే తెలుస్తుందని చెబుతున్నారు.. కానీ, ఎంతమందికి ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే పరిజ్ఞానం ఉంటుందని వినియోగదారులు విమర్శిస్తున్నారు. ఈ విషయాన్ని ఏఈ మణికంఠ దృష్టికి తీసుకెళ్లగా పొరపాటును సరిదిద్దుతామని ఎస్‌బీఎంలలో ఇంక్ సరిగ్గా ఉండేలా చూసుకుని వినియోగదారులకు స్పష్టమైన బిల్లనలు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



ఇంద్రేశంలో వినియోగదారులకు ఇచ్చిన తెల్లకాగితం బిల్లు

తాగునీటి ఎద్దడి

నివారణకు చర్యలు

అక్కన్నపేట, ఏప్రిల్ 12: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్‌చారి తెలిపారు. శుక్రవారం అక్కన్నపేట మండలం బంజారాహిల్స్ తండాలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు కిలోమీటర్ దూరంలో ఉన్న ఓ రైతు వ్యవసాయ బావి నుంచి పైప్‌లైన్ వేసి కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించారు. తాగునీటి సమస్యను పరిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రూహీన తస్కీన్, ఏఈ మౌనిక, మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌తండాలో వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్‌చారి

అబద్దాలలో బీజేపీ బడేమియా.. కాంగ్రెస్ చోటేమియా

- 4 నెలల్లో కాంగ్రెస్ ప్రజాధరణ కోల్పోయింది
- సీఎం రేవంత్ దగ్గర సరుకు లేదు
- దుబ్బాకలో చెల్లని రూపాయి రఘునందన్‌రావు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 12 : అబద్ధాల్లో పోటీపడుతున్న బీజేపీ బడేమియా, కాంగ్రెస్ చోటేమియాలాగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. శుక్రవారం సిద్దిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గులాబీ జెండాకు ఊపిరిపోసిన సిద్దిపేట, ఉద్యమంలో పోరాటం చేసి రాష్ట్రం ఏర్పాటుకు తొలి అడుగు వేసిందన్నారు. ఇప్పుడు గులాబీకి అడ్డాగా మారిందన్నారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ప్రభుత్వంలో లుకలుకలు ప్రారంభమై ప్రజాధరణ కోల్పోయిందన్నారు. వందరోజుల్లో అరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి, 120 రోజులైనా అమలు చేయలేదని చెప్పారు. ఈ విషయాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ చేసిన మోసాలను వివరించాలని దిశానిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి దగ్గర సరుకు లేదు.. పనితనం లేదని ప్రజలకు అర్థమైందన్నారు. అబద్దపు హామీలిచ్చి దుబ్బాక ఉప ఎన్నికలో గెలిచిన రఘునందన్‌రావును గత ఎన్నికల్లో ప్రజలు నమ్మలేదని, బండకేసి కొట్టినట్లు బుద్ధిచెప్పారన్నారు. బీజేపీని ఓడించే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని ముస్లింలు గుర్తించాలని సూచించారు. ఇచ్చిన హామీలు తప్పిన కాంగ్రెస్ మెడలు వంచాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో విద్యావేత్త, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపిద్దామని సూచించారు. అనంతరం పలు కుల సంఘాల నాయకులు బీఆర్ఎస్‌కే తమ మద్దతు అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఏకగ్రీవ తీర్మాన ప్రతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్లు కలకుంట్ల మల్లికార్జున్, గ్యాదరి రవీందర్, బర్ల మల్లికార్జున్, అరవిందరెడ్డి, నాయకులు రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌లాల్, భూపేశ్, మేర సత్తన్న, పాల సాయిరాం, పెర్క మధు తదితరులు పాల్గొన్నారు.



హరీశ్‌రావు ఏకగ్రీవ తీర్మానప్రతులను అందజేస్తున్న పలు కులసంఘాల నాయకులు

దేవుడి పేరుతో మోదీ రాజకీయం

- గ్రౌండ్‌లెవల్‌లో బీజేపీ గ్రాఫ్ పడిపోయింది
- కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్ నాయకులు వేల కోట్ల రూపాయలను దోచుకున్నారు
- అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి సురేఖ

గజ్వేల్, ఏప్రిల్ 12: దేవుడి పేరుతో మోదీ రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అందరికీ దేవుడంటే భక్తి ఉందని, మనమంతా దేవుడిని ఆరాధిస్తామని, కానీ రాజకీయాలకు వాడుకోబోమన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సమావేశం ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సారెడ్డి అధ్యక్షతన పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రౌండ్ లెవల్‌లో బీజేపీ గ్రాఫ్ పడిపోయిందని, ఈ ఎన్నికల్లో పతనం కావడం ఖాయమని స్పష్టం చేశారు. పేదలకు మోదీ ఏం చేయలేదని, కేవలం అంబాని, అదానీలకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. దుబ్బాక ఎమ్మెల్యేగా పనిచేసిన బీజేపీ అభ్యర్థి ఆ నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలని ఆమె ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల రూపాయల అవినీతి చేసిందని, అనేక అక్రమాలు, దోపిడీలకు పాల్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. సేవ చేయాలన్న తపనతో రాజకీయాల్లోకి వచ్చిన ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని ఆమె కోరారు.

మామ, అల్లుడిని ఇంటికి పంపడం ఖాయం

- మైనంపల్లి హనుమంతరావు

మామ, అల్లుడిని నూటికి నూరుశాతం ఇంటికి పంపించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను చింతమడకకు, హరీశ్‌రావును తోటపల్లికి పంపిస్తానన్నారు. తన ప్రధాన టార్గెట్ గజ్వేల్, సిద్దిపేటలో వారిని ఓడించడమే అని ఆయన పేర్కొన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మెదక్ ఎంపీ సీటుపై కాంగ్రెస్ జెండా ఎగరవేసి సోనియాగాంధీకి గిఫ్ట్ ఇవ్వాలని తూంకుంట నర్సారెడ్డి కోరారు. వారితో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, ఆంజనేయులుగౌడ్, గజ్వేల్ అసెంబ్లీ ఇన్‌చార్జి ప్రమోద్‌కుమార్, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, నాయిని యాదగిరి, నెంటూరు రంగారెడ్డి, వంటేరు నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుల్తాన్, బంగార్‌రెడ్డి, జంగం రమేశ్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, యాదగిరి తదితరులున్నారు.



గజ్వేల్‌లో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కొండా సురేఖ

రేపు 'రన్ ఫర్ అంబేడ్కర్'



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ సేవాసమితి నాయకులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 12: తెలంగాణ అంబేడ్కర్ సేవా సమితి(టాస్) ఆధ్వర్యంలో ఈ నెల 14న రన్ ఫర్ అంబేడ్కర్(అంబేడ్కర్ పరుగు) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టాస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జగన్ తెలిపారు. ఈ మేరకు సంగారెడ్డిలో శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సంగారెడ్డిలోని ఐబీ నుంచి పాత బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ రన్ కొనసాగుతుందని, యువకులు, అంబేడ్కర్ వాదులు, పురప్రముఖులు, మేధావులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టాస్ కార్యదర్శి మురారి, సురేశ్, రాజునాయక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలు మారేది నాయకులు.. కార్యకర్తలు కాదు

● బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ కార్యకర్త నర్సింహులు

వెల్దుర్తి, ఏప్రిల్ 12: పదవులు అనుభవించిన నాయకులే పార్టీలు మారుతున్నారు తప్పా.. పార్టీ అభివృద్ధి కోసం, నాయకుల గెలుపు కోసం కృషిచేసే కార్యకర్తలు కాదని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో శుక్రవారం ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా వెల్దుర్తి, మాసాయిపేట మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సునితారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి హాజరుకాగా పలువురు కార్యకర్తలు మాట్లాడారు. పదవులు అనుభవించిన నాయకులు పార్టీలు మారుతున్నారని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు మారడం లేదని, అయినా పార్టీ అభివృద్ధి కోసం, నాయకుల గెలుపు కోసం కృషి చేసే కార్యకర్తలను పార్టీ గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయం నుంచి ఇప్పటివరకు పార్టీని నమ్ముకోని అన్నివిధాల కృషిచేసిన కార్యకర్తలకు ఎలాంటి పదవులు దక్కలేదని వాపోయారు. ఇకనైనా పార్టీ అధినాయకత్వం కష్టపడే కార్యకర్తలను గుర్తించి, వారికి తగిన న్యాయం చేయాలని కోరారు.

బొల్లారంలో రహదారులపై వ్యర్థాల పారవేత

జిన్నారం, ఏప్రిల్ 12: బొల్లారం పారిశ్రామికవాడలో రహదారులపై రెడిమిక్స్ వ్యర్థాలను పారవేస్తున్నారు. గురువారం రాత్రి పారిశ్రామికవాడ నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారిలో రెడిమిక్స్ వ్యర్థాలను రహదారిపై పారవేయడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఇటీవల పలుచోట్ల రెడిమిక్స్ పరిశ్రమలకు చెందిన వ్యర్థాలను రాత్రివేళల్లో వాహనాలలో తీసుకువచ్చి పారవేస్తున్నా.. మున్సిపల్ అధికారులు ఆయా పరిశ్రమలను గుర్తించి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు తెలిపారు. వెంటనే రహదారిపై వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరారు.

నేటి నుంచి సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 12: నారాయణఖేడ్ పట్టణంలోని చరిత్రాత్మకమైన సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 13 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. 13 నుంచి 21 వరకు బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం కరణ్ గజేంద్రభారతి మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా 13న సుప్రభాత సేవ, గణపతి పూజ, ధ్వజారోహణం, గరుడ వాహన సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న కరణ్‌గజేంద్ర భారతి మహరాజ్‌చే అఖండ సప్తాహప్రారంభం, శేష వాహన సేవ, 15న సూర్యప్రభ వాహన సేవ, చైతన్య మహరాజ్ కీర్తన, 16న హంసవాహన సేవ, జ్ఞానేశ్వర్ మహరాజ్‌చే కీర్తన, 17న శ్రీరామ నవమిని పురస్కరించుకొని 12 గంటలకు డోలాహరణం, ప్రవచనాలు, సాయంత్రం హనుమత్ వాహన సేవ, జ్ఞాన్‌రెడ్డి మహరాజ్‌చే కీర్తన, 18న గజవాహన సేవ, శ్రీహరి మహరాజ్‌చే కీర్తన, 19న అశ్వవాహన సేవ, బాలు మహరాజ్‌చే కీర్తన, 20న గాధపూజ, రథోత్సవం, అవదూత్ మహరాజ్‌చే కీర్తన, కుస్తీ పోటీలు, 21న కాల కీర్తన, నగర ప్రదర్శన, కరణ్‌గజేంద్ర భారతి మహరాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాల ముగింపు ఉంటాయన్నారు.

16 నుంచి సిద్ధేశ్వరాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన

జహీరాబాద్, ఏప్రిల్ 12: ఈనెల 16 నుంచి 18 వరకు జహీరాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వరాలయంలో శ్రీకాళభైరవ, మంగళగౌరీమాత, నాగదేవత, ఆంజనేయస్వామి, పంచలింగాలు, హాటకేశ్వరుడు, నందీశ్వరుడు, నవగ్రహాలు, ధ్వజస్తంభం తదితర విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్నామని వారు వివరించారు. మూడురోజుల పాటు జరిగే పూజల్లో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

గ్రామాల్లోని పచ్చని పంట పొలాల నడుమ ఏర్పాటవుతున్న ఇథనాల్ పరిశ్రమ రైతుల్లో, ప్రజల్లో చిచ్చుపెడుతున్నది. పరిశ్రమ ఏర్పాటైతే తమ బతుకులే అగమ్యగోచరంగా మారుతాయని ఆ గ్రామాల ప్రజలు ఆందోళన చేపడుతూ.. పొలాలను విడిచిపెట్టి రోడ్లు ఎక్కుతున్నారు. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం తమకు భవిష్యత్ లేకుండా చేస్తారా అని ప్రశ్నిస్తున్నారు. గ్రామస్థుల ప్రమేయం లేకుండా ఫ్యాక్టరీని ఎలా చేపడతారని యాజమాన్యాన్ని నిలదీస్తున్నారు.

బెజ్జంకి, ఏప్రిల్ 12


గుగ్గిళ్ల గ్రామ శివారులో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్న స్థలం

పచ్చని పొలాల్లో.. ఇథనాల్ చిచ్చు

- అనుమతులిచ్చిన ప్రజాప్రతినిధులు
- ఫ్యాక్టరీ వద్దంటున్న స్థానికులు
- పోలీసు బందోబస్తు నడుమ ఫ్యాక్టరీ పనులు
- ఆందోళనలో మూడు గ్రామాల రైతులు

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల, నరసింహులపల్లి, తిమ్మయ్యపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేయాలని కొన్నినెలలుగా గుగ్గిళ్ల, నరసింహులపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల ప్రజలు పోరాటాలు చేస్తున్నారు. పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలతో భవిష్యత్‌లో అనర్థాలు కలుగుతాయని భావించి ఆయా గ్రామాల రైతులు అందోళన చెందుతున్నారు. పరిశ్రమ స్థాపించడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం గ్రామసభలు నిర్వహించకుండా, గ్రామస్థుల అభిప్రాయాలు తీసుకోకుండా పరిశ్రమ పనులు చేపట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకుంటున్నారు. మూడునెలల నుంచి ఫ్యాక్టరీ పనులు ఆపాలంటే ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తుండగా.. ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం ఆపకుండా పోలీసు బలగాలను పెట్టి మరీ పనులు పూర్తి చేస్తుండడం స్థానికుల్లో విమర్శలకు దారితీస్తున్నది.

వ్యర్థాలు ఎక్కడికి...?

పల్లె ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు నెలకొల్పడం ద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని భావించి మొదట్లో అనుమతులు ఇచ్చిన పాలకవర్గాలు, ప్రజాప్రతినిధులు తర్వాత గ్రామస్థులు ఒప్పుకోకపోవడంతో ఇప్పుడు ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు ఎక్కడికి వెళ్తాయనేదే ప్రశ్నార్థకంగా మారింది. గుగ్గిళ్ల శివారు ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమ వ్యర్థాల వల్ల భవిష్యత్‌లో రైతుల భూములు, నీటి కాలుష్యం జరిగే అవకాశాలుంటాయని స్థానికులు అనుమానిస్తున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం చెప్పిన మేరకు వ్యర్థాలకు ప్రత్యేకంగా భూగర్భంలో ట్యాంక్ నిర్మిస్తామని చర్చ జరుగుతున్నా.. సదరు వ్యర్థాలను ట్యాంక్‌లో ఎంతకాలం నిల్వ ఉంచుతారని సందేహం నెలకొన్నది. శాశ్వతంగా వ్యర్థాలు ట్యాంకుల్లోనే నిల్వ చేస్తారా అనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతున్నది. నీటిలోకి వదిలేస్తే నీరు, కాలుష్యం జరిగే ప్రమాదం ఉంటుంది. తద్వారా స్థానికులకు భవిష్యత్‌లో సంకటాలు తప్పవని నిపుణులు భావిస్తున్నారు. పరిశ్రమకు కావాల్సిన అన్ని అనుమతులు పొంది పనులు ప్రారంభిస్తున్న ఫ్యాక్టరీ యాజమాన్యం భవిష్యత్‌లో వ్యర్థాల విషయంలో జాగ్రత్తలు ఎంతవరకు పాటిస్తుందోననే రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా గ్రామ పంచాయతీల్లో అనుమతులు పొందిన ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఎలాగైనా అడ్డుకుంటామని ప్రజలు, నాయకులు చెబుతున్నారు. ఫ్యాక్టరీ పనులు పోలీసుల అండతో కొనసాగించడం పట్ల విమర్శలు గుప్పిస్తున్నారు.

ముడుపులు ముట్టాయని ఆరోపణలు

పరిశ్రమ అనుమతుల ఏర్పాటు కోసం మూడు గ్రామాల్లోని కొందరికి పెద్దఎత్తున ముడుపులు ముట్టాయని బాహటంగానే చర్చ జరుగుతుండడంతో పాటు మాజీ పాలకవర్గ సభ్యులను ప్రజలు నిలదీస్తున్నారు. దీంతో చేసేది ఏమీ లేక ప్రజలతో కలిసి ఫ్యాక్టరీ నిర్మాణం రద్దు కోసం పోరాటాలు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని ఆందోళన

బెజ్జంకి, ఏప్రిల్ 12: ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని ఆయా గ్రామాల ప్రజలు శుక్రవారం ఆందోళనకు దిగారు. బెజ్జంకి మండలంలోని నర్సింహులపల్లి, గుగిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ పనులు రోజురోజుకు వివాదస్పదమవుతున్నాయి. పరిశ్రమ ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో తమ బతుకులు ఆగమవుతాయని తిమ్మాయిపల్లి, గుగ్గిళ్ల, నర్సింహులపల్లి గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం ఆందోళన బాటపట్టారు. మండలంలోని నర్సింహులపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ భూమి పూజను యాజమాన్యం చేపట్టింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పనులను అడ్డుకునేందుకు తరలివెళ్లారు. పోలీసులు వారితో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఒక దశలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామస్థుల అభ్యర్థన మేరకు పనులు నిలిపివేసేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. గ్రామసభ తీర్మానం లేకుండా పనులు చేపడితే ఊరుకోబోమని హెచ్చరించారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

మా ఆధార్ కార్డులు తీసుకున్నారు.



మా గ్రామంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను చేపట్టొద్దని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేశాం. విచారణకు వచ్చిన డీఎల్పీవో 200 మంది ఆధార్‌కార్డుల జిరాక్సులపై సంతకాలను తీసుకొని వెళ్లారు. మేము ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా తీర్మానం చేసి జిరాక్సులను ఇచ్చాం. సంబంధిత అధికారులు అనుకూలంగా ఇచ్చారో వ్యతిరేకంగా ఇచ్చారో ఇప్పటికి కూడా చెప్పడం లేదు.

- సంతోష్, గుగ్గిళ్ల, రైతు

మాకు పంటలు పండవు...



నరసింహులపల్లి, గుగ్గిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ వల్ల భవిష్యత్‌లో మా పంట పొలాలు దెబ్బతిని మాకు పంటలు పండవు. కొందరి స్వార్థం కోసం ముడుపులు తీసుకొని మా బతుకులను ఆగం చేస్తున్నారు.

- మాజీ సర్పంచ్ ఆగయ్య, గుగ్గిళ్ల

కుంటలో పడి ఇద్దరు యువకుల దుర్మరణం

పటాన్‌చెరు, ఏప్రిల్ 12: చేపలు పట్టేందుకు వెళ్లి కుంటలో మునిగి ఇద్దరు యువకులు మృతిచెందారు. పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామానికి చెందిన శ్రీను(25), మహేష్(28) శుక్రవారం సాయంత్రం చేపలు పట్టేందుకు శివారులోని తేటకుంటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు కుంట నీటిలో పడి ఇద్దరూ మునిగి చనిపోయారు. ఏ కారణంతో నీటిలో పడిపోయారనే దానిపై స్పష్టత లేదు. చీకటి పడినా ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. వారిని వెతికే క్రమంలో తేటకుంట వద్దకు రాగానే గట్టుపై వారి దుస్తులు, చెప్పులు లభించాయి. నీటి అడుగున గాలించగా ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. ఈ మేరకు గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


యువకుల మృతదేహాలు

విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థిని మృతి

కోహీర్, ఏప్రిల్ 12: విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థిని మృతిచెందింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగింది. గ్రామానికి చెందిన బ్యాగరి అశోక్‌కు ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కూతురు చందన(16) మెదక్ జిల్లా తూప్రాన్‌లో గల తెలంగాణ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుకుని ఇటీవలనే వార్షిక పరీక్షలు రాసి వేసవి సెలవులకు ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం ఇంటిపైన బట్టలు ఆరేసేందుకు వెళ్తున్నది. ఈ క్రమంలో మెట్ల పక్కన ఉన్న ఇనుప చువ్వను పట్టుకున్నది. విద్యుత్ స్తంభం నుంచి ఇంట్లో ఉన్న మీటర్‌కు అనుసంధానంగా ఉన్న సర్వీస్ వైరు తేలి ఉండడం వల్ల ఇనుప చువ్వకు విద్యుత్ సరఫరా అయింది. దీంతో చందనకు షాక్ తగిలి అక్కడికక్కడే పడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కోహీర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందిదని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.


చందన(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


యాదయ్య(ఫైల్)

ములుగు, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ములుగు మండలం కొక్కొండ గ్రామానికి చెందిన మురారి పెద్ద యాదయ్య(60) ఈ నెల 8న సాయంత్రం బైక్‌పై పొలం నుంచి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తూరు నుంచి మరో బైక్‌పై వస్తున్న వ్యక్తి వెనక నుంచి యాదయ్య బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో యాదయ్యకు తీవ్రగాయాలు కాగా, లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 4.30 గంటలకు మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అండాలు తెలిపారు.

ఫ్యాన్‌కు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంతో కాలనీలో బాలుడిని ఢీకొట్టిన బాధతో మనస్తాపానికి గురైన ఓవ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా, పాపన్నపేట మండలం, పోచంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మహిపాల్(39) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి భాగ్యలక్ష్మీ కాలనీలో కుటుంబసమేతంగా ఉంటున్నాడు. స్థానికంగా ఓ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారంరోజుల క్రితం ఓ బాలుడిని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఆ బాలుడికి ఏమవుతుందోనని భయపడి సొంత ఊరికి వెళ్లివచ్చాడు. బాలుడి వైద్యానికి అయ్యే ఖర్చులు భరిద్దామని భార్య ఓదార్చింది. కాగా మహిపాల్‌కు బెట్టింగ్ ఆడే అలవాటు ఉన్నది. బాలుడి సంఘటన, బెట్టింగ్‌తో మనస్తాపానికి గురైన మహిపాల్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పేట్‌బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మహిపాల్(ఫైల్)

ప్రమాదవశాత్తు జామతోట దగ్ధం

- రూ.5 లక్షల నష్టం


దగ్ధమైన జామతోట

చేగుంట, ఏప్రిల్ 12: ప్రమాదవశాత్తు జామ తోట దగ్ధమైన సంఘటన చేగుంట మండలం వల్లభపూర్‌తండాలో శుక్రవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన నేనావత్ లీల తనకున్న ఎకరం భూమిలో జామతోటను డ్రిప్ ద్వారా సాగు చేస్తున్నది. కాగా శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని జామ తోటతో పాటు డ్రిప్ పైపులు కూడా పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటనతో సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితురాలు తెలిపింది.

టాస్క్‌ఫోర్స్ పోలీసులపై ఇసుక మాఫియా దాడి

కొల్చారం, ఏప్రిల్ 4: టాస్క్‌ఫోర్స్ పోలీసులపై ఇసుక మాఫియా దాడిచేసిన సంఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయిన్ జలాల్‌పూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. హల్దీవాగు నుంచి నాయిన్ జలాల్‌పూర్, కొంగోడు గ్రామాల ఇసుక మాఫియా అనుమతి లేకుండా రాత్రి పూట కొడిపల్లి, వెల్మకన్నె, రాయిలాపూర్, అంసాన్‌పల్లి, కొల్చారం గ్రామాలకు ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మెదక్ టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుమలేశ్ ఆధ్వర్యంలో నలుగురు సిబ్బంది గురువారం రాత్రి హల్దీవాగులో ఇసుక నింపుతున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. దాంతో ట్రాక్టర్ల యజమానులు టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుమలేశ్‌తో వాగ్వివాదానికి దిగారు. అక్కడి నుంచి కొన్ని ట్రాక్టర్లు ఇసుకను కుమ్మరించి నాయిన్‌జలాల్‌పూర్ గ్రామంలోకి వెళ్లాయని తెలిసి పోలీసులు కూడా వెళ్లారు. దాంతో గ్రామస్థులు కొంతమంది ముఠాగా ఏర్పడి టాస్క్‌ఫోర్స్ పోలీసులపై దాడిచేసి గాయపర్చారు. కొంతమంది ట్రాక్టర్ యజమానుల సెల్‌ఫోన్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకెళ్లి కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి, దాడిచేసిన వారిపై ఫిర్యాదు చేశారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇరువురి అరెస్ట్

- 1,500 గ్రాముల గంజాయి స్వాధీనం

హుస్నాబాద్, ఏప్రిల్ 12: హుస్నాబాద్ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇరువురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కరీంనగర్ రోడ్డు సబ్ స్టేషన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించగా పట్టణానికి చెందిన చుక్క అనిల్, హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డతండాకు చెందిన గుగులోతు సంతోష్‌లను పట్టుకొని, వారి నుంచి 1,500 గ్రాముల గంజాయితో పాటు టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని విచారించగా వీర్లగడ్డతండాకు చెందిన బుక్య రమేశ్ వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారని చెప్పారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్

- 4 సెల్‌ఫోన్లు, గంజాయి ప్యాకెట్లు, బైక్ స్వాధీనం

కొల్చారం, ఏప్రిల్ 12: కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి చౌరస్తా సమీపంలోని పంట పొలాల్లో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పోతంశెట్‌పల్లి చౌరస్తా సమీపంలోని పంట పొలాల్లో అనుమానితులుగా ఉన్న పలువురు యువకులపై దాడిచేయగా మెదక్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఇద్దరు, కొల్చారం మండలం అప్పాజిపల్లి, పోతంశెట్‌పల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. వీరి నుంచి 4 సెల్‌ఫోన్లు, గంజాయి ప్యాకెట్లు, మద్యం సీసాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని కొల్చారం పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

హవేళిఘణపూర్, ఏప్రిల్ 12: ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని భూర్గుపల్లి, వాడి, రాజిపేట, కొత్తపల్లి, గాజిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలన్నారు. ధాన్యంలో 17 శాతం తేమ ఉండాలన్నారు. కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మాజీ, సీఈవో సాయి, నిర్వాహకులు పాల్గొన్నారు.


భూర్గుపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

రైతు భగీరథ ప్రయత్నం


- ట్యాంకర్ ద్వారా వరి పంటకు నీరు సరఫరా


వరిచేనుకు ట్యాంకర్ ద్వారా నీరు పెడుతున్న రైతు మాణిక్యం

కొల్చారం, ఏప్రిల్ 12: చేతికొచ్చిన పంట కళ్లముందే ఎండిపోతుంటే కాపాడుకునేందుకు మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామానికి చెందిన రైతు మాణిక్యం భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. కొల్చారం శివారులో తనకున్న మూడెకరాలలో వరి సాగు చేశాడు. నాట్లు వేసే సమయంలో పుష్కలంగా నీళ్లు పోసిన బోర్లు ఒక్కసారిగా తగ్గిపోవడంతో పంట ఎండుముఖం పట్టింది. పక్క పొలానికి చెందిన రైతును డబ్బులు ఇస్తాను. నీళ్లు కావాలని అడగ్గా.. అతడు ఒప్పుకోలేదు. దీంతో రైతు మాణిక్యం అప్పాజిపల్లి శివారులో చారాణ పొలుకు బోరును లీజుకు తీసుకుని తన సొంత ట్రాక్టర్‌కు ట్యాంకర్‌ను కిరాయి తీసుకుని రోజూ ఐదు ట్యాంకర్ల నీటిని నింపుకుని వచ్చి పంట పొలాన్ని తడుపుతున్నాడు. ట్యాంకర్ కిరాయితో పాటు రోజూ రూ.1000 డీజిల్‌కు ఖర్చవుతుందని రైతులు తెలిపాడు.

మా పరిస్థితి ఏంటీ!

- ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వర్గం ప్రశ్న


తూప్రాన్‌లో సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు

తూప్రాన్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్‌లోని ఓ వర్గం నాయకులు మా పరిస్థితి ఏంటంటూ ప్రశ్నిస్తున్నారు. ఏకంగా సమావేశం నిర్వహించుకుని హరీశ్‌రావు వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సంఘటన మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ మండలంలో చోటు చేసుకున్నది.. తూప్రాన్ మండలంలో బీఆర్ఎస్ రెండు వర్గాలుగా కొనసాగుతున్నది. పార్టీ మండలాధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో శివసాయి గార్డెన్‌లో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం రావడం లేదని, ఏ సమావేశం వివరాలు తెలుపడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. 32 వాహనాల్లో సుమారు 200 మంది సిద్దిపేటకు తరలివెళ్లారు. అక్కడ హరీశ్‌రావుకు తమ ఆవేదనను చెప్పుకున్నారు. పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానంటూ హరీశ్‌రావు హామీ ఇవ్వడంతో తిరిగి వచ్చారని తెలిసింది.

వరిలో ఊస.. రైతన్నల్లో నిరాశ

- పొట్ట దశలో అందని నీరు
- తాలుగా మారుతున్న వరి


ఊస ప్రభావంతో తాలుగా మారిన వరిపంట

కుకునూరుపల్లి, ఏప్రిల్ 12: భూగర్భ జలాలు అడుగంటడంతో పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. బోరుమోటార్‌కు అదనంగా పైపులను జోడించడం, వాటర్ ట్యాంకర్ల ద్వారా వరికి నీరు అందిస్తున్నారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా.. వరిలో ఊస పోవడం(తెల్లకంకి)తో పంట దిగుబడి తగ్గుతుందని, తాలు కూడా ఎక్కువగా వస్తున్నదని రైతుల్లో నిరాశ నెలకొన్నది. కుకునూరుపల్లి మండలంలో 6 వేల ఎకరాలకు పైగా వరి సాగుచేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఒకవైపు భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పంటకు నీరు అందక మండలంలో వందల ఎకరాల్లో వరి పంటలను వదిలి పెడుతున్నారు. మరోవైపు ఊస ప్రభావం రైతులను తీవ్రంగా నష్ట పరుస్తున్నది. ఊసపోవడంపై వ్యవసాయ అధికారి ప్రియదర్శినిని సంప్రదించగా.. నారు దశలోనే కార్బోఫ్యూరాన్ 3జీ, కార్బో హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను చల్లాలని, నాటు వేసిన 15 రోజులకు క్రిమిసంహారక రసాయనాలను పిచికారీ చేయాలి. లేకపోతే వరి పొట్టకు వచ్చే ముందే రైతులు ప్రాథమిక దశలోనే ఊస ప్రభావాన్ని గమనించి విర్గాకో క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తే ఊస ప్రభావం వరిపై ఉండదని చెప్పారు.

పలు మండలాల్లో ముమ్మరంగా వాహనాల తనిఖీలు

- రూ.3,93,000 లక్షల నగదు పట్టివేత

చేర్యాల, ఏప్రిల్ 12: చేర్యాల మండలం ముస్త్యాల చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో శుక్రవారం రూ.1.60 లక్షలు నగదు పట్టుకున్నారు. జనగామ నుంచి చేర్యాలకు ఆటోలో వస్తున్న క్రమంలో చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేశారు. ఆటోలో రూ.1.60 లక్షల నగదు పట్టుబడగా, ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఎంసీసీ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

వంటిమామిడి వద్ద రూ.1.50 లక్షలు

ములుగు, ఏప్రిల్ 12: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ములుగు మండలం వంటిమామిడి చెక్‌పోస్టు వద్ద సీపీ అనురాధ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 5 నుంచి 7 గంటల వరకు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వద్ద రూ.1.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

హబ్షీపూర్ వద్ద రూ.83 వేలు

దుబ్బాక, ఏప్రిల్ 12: దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామం వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.83 వేల నగదు పట్టుబడిందని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేట వార్డుకు చెందిన హరీశ్ సరైన పత్రాలు లేకుండా రూ.83 వేలు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి మోహన్‌కు సమాచారం ఇచ్చి.. నగదు అప్పజెప్పారు.


వంటిమామిడిలో నగదు పట్టుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

ఐస్‌క్రీం, పండ్లరసాలతో ఆరోగ్యం పైలం

- కలుషిత నీరు, రసాయనాలతో తయారీ
- కోకొల్లలుగా పుట్టుకొస్తున్న జ్యూస్, ఐస్‌క్రీం సెంటర్లు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 12: వేసవికాలంలో శీతల పదార్థాలు, పానీయాలకు, ఐస్‌క్రీంలకు ఎంత డిమాండ్ ఉంటుందో చెప్పనక్కరలేదు. ఏ వీధిలో చూసినా.. ఏ కూడళ్లలో చూసినా ఇవే దర్శనమిస్తాయి. ఇదే అదునుగా భావించిన నిర్వాహకులు కలుషిత నీరు, రసాయనాలతో జ్యూస్, ఐస్‌క్రీంలు తయారుచేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాణ్యత లేకుండా తయారుచేస్తున్న ఐస్‌క్రీంలు, పండ్ల రసాల పట్ల అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలు లేని ఐస్‌క్రీంలు

వేసవి ఐస్‌క్రీంలు అంటే చాలా ఇష్టపడతారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని నాసిరకం, నాణ్యత లేని ఐస్‌క్రీంలు తయారు చేసి బజారులో అమ్ముతున్నారు. ఇందులో అనుమతి పొందిన కంపెనీలు ఎన్ని, లేనివి ఎన్ని, అవి ఎలా గుర్తుపట్టాలో తెలియక ప్రజలు సతమతమవుతున్నారు. సదరు కంపెనీలు బ్రాండెడ్ కంపెనీ పోలిన ప్యాకింగ్‌లు చేస్తూ అమ్ముతున్నారు. భూగర్భ జలాలను శుద్ధి చేయకుండానే, ఉప్పు నీళ్లను ఐస్‌క్రీల తయారీకి ఉపయోగిస్తున్నారు. మెదక్ పట్టణంలో ఉన్న ఐస్ కంపెనీలపై అధికారుల నిఘా కరువైంది. ఈ కలుషిత జలాలతో చేసిన ఐస్‌నే పండ్ల రసాలలో వాడుతున్నారు. దీంట్లో ఉండే పిగ్మెంట్స్ చాలా ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. అది పట్టని ఆయా కంపెనీ యాజమాన్యాలు కల్తీలకు పాల్పడుతున్నారు.


ఐస్‌క్రీంను తయారు చేస్తున్న దృశ్యం

నాసిరకంగా పండ్ల రసాలు

పట్టణంలో ఎక్కడచూసినా పండ్ల రసాల బండ్లు దర్శనమిస్తున్నాయి. ఫ్రూట్ సలాడ్‌ల పేరిట చెడిపోయిన పండ్లను వాడుతున్నారు. బాదం పాలు రూ.30లకు అమ్ముతున్నారు. వీరు అమ్ముతున్న ధర ప్రకారం.. మార్కెట్‌లో బాదం ధరలు చాలా ఎక్కువ. వీటినీ కల్తీమయం చేస్తున్నట్టు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్తీ చేపడుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లను ఇప్పించే బాధ్యత తీసుకుంటాం

• ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 12: డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు ఇళ్లను ఇప్పించే బాధ్యత తీసుకుంటామని, అవసరమైతే వీధి పోరాటాలకు దిగుతామని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులను పలువురు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. వారితో మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఉప్పల మెట్టయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో 'బెల్టు' జోరు

• ఏరులై పారుతున్న మద్యం

• పట్టించుకోని అధికారులు

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 12: ప్రశాంతంగా ఉండే పల్లెల్లో మద్యం ఏరులై పారుతున్నది. గల్లీల్లో బెల్టు షాపులు పుట్టగొడుగుల్ల పుట్టుకొస్తున్నాయి. సిద్దిపేట రూరల్ మండలంలో 14గ్రామ పంచాయతీలలో సుమారు 50కి పైగా బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. అయితే మండలం పరిధిలో రెండు మద్యం దుకాణాలు ఉన్నప్పటికీ, మద్యం ప్రియులు మాత్రం బెల్టు షాపులకే జై కొడుతున్నారు. వారి గ్రామంలోనే ఏ సమయంలోనేనా మద్యం లభిస్తుండడంతో విచ్చలవిడిగా తాగుతున్నారు. వీటి కారణంగా గ్రామాల్లోని యువకులు, విద్యార్థులు కూడా మద్యానికి బానిసలవుతున్నారు.

మద్యం దుకాణదారులే..

మద్యం దుకాణదారులు కొత్తరకం వ్యాపారానికి తెరలేపారు. వారి సొంత వాహనాలలో తీసుకెళ్లి బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారు. మద్యం బెల్టు షాపు వద్దకే సరఫరా చేస్తుండడం, క్రెడిట్ సౌకర్యం కూడా ఇస్తుండడంతో హోటళ్లు, కిరాణ దుకాణం నిర్వహకులు మద్యం విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు.



కేసులు నమోదు చేస్తున్నాం



సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయించిన వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. అక్రమంగా మద్యం విక్రయించడం, డ్రగ్స్ విక్రయించడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం, నిషేధిత వస్తువులు విక్రయించడం తదితర అంశాల అప్రమత్తతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు సమాచారాన్ని అందిస్తే వెంటనే స్పందిస్తాం. సమాచారం ఇచ్చిన వారి పేర్లు, ఫోన్ నెంబర్లు గోప్యంగా ఉంచుతాం.

- అపూర్వరెడ్డి, ఎస్ఐ సిద్దిపేట రూరల్

పోలీసులపై దాడులు

గ్రామాలలోని కుల సంఘ భవనాలు, నూతనంగా నిర్మిస్తున్న భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రి వేళల్లో యువత మద్యం సేవిస్తూ, గొడవలకు దిగుతున్నారు. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులపైనే దాడులు చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. ఇంత జరిగిన సంబంధిత శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు బెల్టు షాప్ లపై చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నర్సింహులు మృతదేహం

మిరుదొడ్డి, ఏప్రిల్12: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాములు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన ఎద్దు నర్సింహులు(52)అనే వ్యక్తి కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నాడు. పాత ఇంటి నుంచి కొత్త ఇంటికి విద్యుత్ సరఫరా కోసం ప్లగ్‌ను బిగిస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

బెజ్జంకి, ఏప్రిల్ 12: కడుపు నొప్పికి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని కల్లెపల్లి అనుబంధ గ్రామమైన ఇటిరెడ్డిపల్లిలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన కాంతవ్వ(85) కుమారుడు, కోడలితో కలిసి గ్రామంలో ఉంటున్నది. కొద్దికాలంగా ఆమె కడుపు నొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు బాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

మిరుదొడ్డి ఏప్రిల్ 12: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని మిరుదొడ్డి ఎస్ఐ పర్శరాములు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పర్వతం శ్యాంకుమార్ అనే వ్యక్తి ఏపీ 24ఎక్స్ 2551 ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పదిక్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసునమోదు చేసి ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పంటలను నష్టపరుస్తున్న అడవి పందులు



అడవి పందుల సంచారంతో దెబ్బతిన్న పంట

చేర్యాల, ఏప్రిల్ 12: ఓ వైపు భూగర్భజలాలు అడుగంటి బోర్లు పనిచేయక పంటలు ఎండిపోతుంటే మరో వైపు అడవి పందుల బెడదతో రైతులు ఆందోళనకు చెందుతున్నారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసుకుని పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో రాత్రివేళల్లో అడవిపందులు పంటపొలాలను నాశనం చేస్తుండటంతో చేతికొచ్చిన అరకొర పంటను కూడా కోల్పోవల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేర్యాల పట్టణ శివారు గురుకుల పాఠశాల సమీపంలోని పంటపొలాలను అడవి పందులు తొక్కి నాశనం చేస్తుండడంతో రాత్రివేళ రైతులు కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఎండిన పంటల కు ప్రభుత్వం నష్టపరిహారం అందించడంతో పాటు అడవిపందుల నుంచి పంటలకు రక్షణ కల్పించాలని రైతులు వేడుకుంటున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లికి చెందిన పలువురు నాయకులు

జగదేవ్‌పూర్/గజ్వేల్ /కొండపాక ఏప్రిల్ 12: మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఉప్పల ప్రవీణ్‌కుమార్‌గుప్త శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నర్సారెడ్డి పార్టీ కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, నాయకులు మనోజ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన పిట్ల రమేశ్, కొక్కొండ రాజు, శాతం సత్తయ్య, శాతం స్వామి, వంజరి ఋషి, పిట్ల వెంకటేశ్, శాతం శ్రీనివాస్, శాతం మల్లేశ్, శాతం అనిల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. అయనవెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, నాయకులు ఉన్నారు. కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. గ్రామానికి చెందిన పెద్దంకుల శ్రీకాంత్, ఫొటో యూనియన్ జిల్లా కార్యదర్శి బ్రహ్మచారిలతో పాటు పలువురు గజ్వేల్‌లో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్, కొండపాక మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము మల్లికార్జున తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన కొండపాక నాయకులతో నర్సారెడ్డి

ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిని గెలిపించండి



దూళిమిట్టలో మాట్లాడుతున్న చొప్పరి రవికుమార్

• సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్

దూళిమిట్ట, ఏప్రిల్ 12: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపు కోసం కార్యకర్తలు పని చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. దూళిమిట్ట మండల కేంద్రంలో, జాలపల్లి గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించి, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచడం తప్ప బీజేపీ చేసిందేమీ లేదన్నారు. పేద ప్రజల నడ్డి విరిచి కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చడం ఆ పార్టీ విధానమని ఆరోపించారు. కార్యక్రమంలో పోతిరెడ్డి రాజు, సత్యనారాయణ, మల్లయ్య, ప్రసాద్, రాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడి ఎన్నిక

గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 12: ఆర్ అండ్‌ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్ నాయీ బ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షుడిగా మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, కోశాధికారిగా నరేశ్, సంయుక్త కార్యదర్శిగా సుధాకర్, కార్యదర్శిగా సురేశ్‌లను ఎన్నుకున్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడి నియామకం

అక్కన్నపేట, ఏప్రిల్ 12: బీజేవైఎం అక్కన్నపేట అధ్యక్షుడిగా మండలంలోని మల్లంపల్లికి చెందిన బత్తిని జీవన్‌గౌడ్‌ను నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

గజ్వేల్/గజ్వేల్‌టౌన్ ఏప్రిల్ 12: వాసవి మాత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు.

మంత్రి కొండా సురేఖకు ఘనస్వాగతం

ములుగు, ఏప్రిల్ 12: గజ్వేల్‌లో నిర్వహిస్తున్న కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండ సురేఖ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావులకు వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద పార్టీ మండల అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్త ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి గజ్వేల్ వరకు బైక్ ర్యాలీతో తీసుకెళ్లారు.

జగదీశ్ మృతికి హరీశ్‌రావు సంతాపం



జగదీశ్ కుటుంబసభ్యులను ఓదారుస్తున్న హరీశ్‌రావు

నంగునూరు, ఏప్రిల్ 12: నంగునూరు మండలం ముండ్రాయి గ్రామానికి చెందిన గీత కార్మికుడు జగదీశ్ మృతి పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు సంతాపం ప్రకటించారు. శుక్రవారం మండలంలోని ముండ్రాయి గ్రామానికి వెళ్లి జగదీశ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. ఒకపక్క గీత కార్మికుడిగా పనిచేస్తూ, బీఆర్ఎస్‌లో యువజన విభాగం అధ్యక్షుడిగా, క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా తనదైన పాత్ర పోషించేవాడని చెప్పారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ కమలాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర శ్రావణి కథ ఎంపిక

కొండపాక, ఏప్రిల్ 12: మండలంలోని సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎర్ర శ్రావణి రాసిన 'ఈర్ష్య' అనే కథ బాలల కథా సంకలనానికి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దివిఠల్ తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల కథా సంకలనం కోసం విద్యార్థుల నుంచి కథలను ఆహ్వానించింది. కథ రాయడానికి ప్రోత్సహించిన తెలుగు ఉపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థినిని ఆయన అభినందించారు.

'చెట్లను దగ్ధం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

హుస్నాబాద్, ఏప్రిల్ 12 : హుస్నాబాద్ పట్టణ పొట్లపల్లి రోడ్లో ఉన్న తాటి, ఈత చెట్లకు నిప్పంటించి దగ్ధం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కోరారు. దగ్ధమైన చెట్లను ఆయన శుక్రవారం పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ఎనగందుల శంకర్, వేల్పుల రాజు, గౌడ సంఘం నాయకులు లక్ష్మణ్‌గౌడ్, కొయ్యడ శ్రీనివాస్, సమ్మయ్య గౌడ్, రవి, పూదరి శ్రీనివాస్ తదితరులున్నారు.

తలంబ్రాల బుకింగ్ ప్రారంభం

నారాయణఖేడ్, ఏప్రిల్ 12: భద్రాద్రి సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను నేరుగా ఇంటి వద్దకు చేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఖేడ్ పట్టణంతో పాటు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ముమ్మరంగా బుకింగ్ ప్రారంభించారు. శుక్రవారం ఖేడ్ ఆర్టీసీ డిపో మార్కెటింగ్ ఇన్‌చార్జి పాండు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పలువురికి అవగాహన కల్పించి, బుకింగ్ చేయించి రసీదులను అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేసుకోవాలి

• తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

చేగుంట, ఏప్రిల్ 12: చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వడ్ల కొనుగోలు పై అధికారులకు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 27 ధాన్యం కొనుగోలు సెంటర్లలో అవసరమైన వసతులు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు ట్రక్‌షీట్లు అందించాలన్నారు. రవాణాకు ఇబ్బంది కలగకుండా వెంటనే ధాన్యాన్ని తరలించి రైతు వివరాలను త్వరగా అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. ధాన్యంలో తాలు శాతం అధికంగా ఉంటే రైతుతో రాతపూర్వకంగా రాయించుకోవాలని ధాన్యం కటింగ్ చేయాలని తెలిపారు. కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి రావాలని ఆర్డీవో జయ చంద్రారెడ్డి తెలిపారు. సమీక్ష సమావేశంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, జూనియర్ అసిస్టెంట్ విజయ్, కార్యదర్శులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన పీడీ

చేగుంట, ఏప్రిల్ 12: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చేగుంట మండల కేంద్రంతో పాటు మండలంలోని అనంతసాగర్, ఇబ్రహీంపూర్, బోనాల, గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యంలో తేమ శాతం సరిగా చూసుకొని ధాన్యం వెంట వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. కేంద్రాల వద్ద మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. ఆయన వెంట సీసీలు రామస్వామి. స్వామి. తదితరులు వున్నారు.

అణగారినవర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆధ్యాపకులు, విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 12 : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, అర్థశాస్త్ర విభాగం సంయుక్తంగా మహాత్మాజ్యోతిరావుపూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారినవర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఆయన కొనియాడారు. సమాజంలో సాంఘిక దురాచారాలను నిర్మూలించడానికి కృషి చేస్తూ తన జీవితాన్ని సమాజసేవకే అంకితం చేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జగదీశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవమార్గంలో నడిస్తే రాజమార్గం తథ్యం



పీఠాధిపతి సమక్షంలో జలాభిషేకం చేస్తున్న భక్తులు

టేక్మాల్ ఎప్రిల్ 12: దైవ మార్గంలో ప్రతి ఒక్కరు నడిస్తే రాజా మార్గం అదే వస్తుందని శ్రీశైల సద్గురు పండితులు అన్నారు. శుక్రవారం మండలంలోని పల్వంచ గ్రామ శివారులో వైభవోపేతంగా కుంబాభిషేకం మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పీఠాధిపతులు హాజరయ్యారు. అననంతరం కేతకీ సంగమేశ్వర స్వామికి, మహామంగళ హారతి, జగద్గురువుకు పాదపూజ నిర్వహించారు. అనంతరం శ్రీశైలం పీఠాధిపతి జగద్గురు సిద్ధిరామ పండితరాధ్య శివాచార్య మహా స్వామి మాట్లాడుతూ దైవమార్గాన్ని నమ్మినవారికి రాజమార్గం వెతుక్కుంటూ వస్తుందని ఉద్బోధించారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, వీరశైవలింగాయత్ సభ్యులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీల అమలులో విఫలం'

కొండపాక, ఏప్రిల్ 12: కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, 6 గ్యారంటీలు అమలు చేస్తామని నయవంచన చేసిందని బీఆర్ఎస్ నాయకుడు, నాచారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ఆరోపించాడు. మండలంలోని వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజుల్లో అభివృద్ధిని మరచి, ప్రతిపక్ష నాయకులపై దుమ్మెత్తి పోయడానికే సరిపోయిందని పేర్కొన్నాడు. అరు గ్రారంటీల అమలులో విఫలమయిందని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జిర్రరాజు చింతల యాదగిరి, సున్నం భాస్కర్, మల్లికార్జున్, భాస్కర్, అజయ్, స్వామి, నాగరాజు, చందు ఉన్నారు.

ముగిసిన గోటి తలంబ్రాల దీక్ష



గోటితలంబ్రాలు చూపిస్తున్న మహిళలు

గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 12: భద్రాచల సీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు అందించే బాధ్యతను గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్తసమాజం సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకు ఇచ్చారు. నెల రోజుల నుంచి కోటి తలంబ్రాల దీక్షను తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించి, లక్ష మంది భాగస్వాములను చేసి శుక్రవారంతో కోటి తలంబ్రాల దీక్షను పూర్తి చేశారు. భద్రాచల దేవస్థానం అందజేసిన 150 కిలోల గోటి తలంబ్రాలు(వడ్లు) గజ్వేల్‌లోని శ్రీ రామకోటి భక్త సమాజానికి అందించగా, వారు ఊరు, వాడా, కుల, మతాలకు అతీతంగా గోటితో వడ్లు ఒలిచి తలంబ్రాలుగా చేసి రామకోటి రామరాజుకు అన్ని గ్రామాల భక్తులు అందజేశారు. ఇలాంటి అదృష్టం తమకు కలుగజేసిన రామకోటి రామరాజుకు భక్తులు కృతజ్ఞతలు

'భూ వారసులం మేమే'

కుకునూరుపల్లి, ఏప్రిల్ 12: భూ వారసులం తామేనని, అధికారులు కూడా అది ధృవీకరించారని బాధితులు తెలిపారు. కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన గంగిశెట్టి రామ చంద్రయ్యకు సర్వే నంబర్ 17లో 37 గుంటల భూమి ఉంది. రామచంద్రయ్య మరణానంతరం వారి కుమారులైన గంగిశెట్టి శ్రీనివాస్, గంటిశెట్టి లక్ష్మీమల్లయ్య గంగిశెట్టి బ్రహ్మం అనే కుమారుడు చనిపోవడంతో అతని భార్య విజయలక్ష్మికి ఆ భూమి వారసత్వంగా వచ్చిందని వారు తెలిపారు. శుక్రవారం బాధితులు విలేఖరులతో మాట్లాడుతూ.. గ్రామంలోని కొందరు తాము ఆ భూమిని ఆక్రమించుకున్నామని వాదనకు దిగుతూ, తమపై దుష్ప్రచారం చేస్తున్నారని బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన గజ్వేల్ డివిజన్ సర్వేయర్ మూడు రోజుల క్రితం క్షేత్రస్థాయి పరిశీలన చేసి సర్వే నంబర్ 17లో ఉన్న భూమి గంగిశెట్టి శ్రీనివాస్, విజయలక్ష్మి, లక్ష్మి మల్లయ్యకే చెందుతుందని ధృవీకరణ పత్రాన్ని కూడా అందజేశారని వారు తెలిపారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 12: ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. సంగారెడ్డిలోని స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఏబీవీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాశ్ మాట్లాడుతూ.. భారతదేశపు ఇంజనీరుగా, పండితుడిగా, రాజనీతిజ్ఞుడిగా, మైసూరు సంస్థానానికి దివానుగా పనిచేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు తానాజీ, దినేశ్, నిఖిల్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మెదక్ బల్దియాలో బీఆర్ఎస్‌కు బీటలు

• ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న కౌన్సిలర్లు



మెదక్ మున్సిపల్ కార్యాలయం



మెదక్, ఏప్రిల్ 12 : మెదక్ మున్సిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీపై గురిపెట్టారు. ఒక్కొక్కరుగా కౌన్సిలర్లను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో బీఆర్ఎస్ పార్టీ ఉనికే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి నెలకొన్నది.

పార్టీలవారీగా పరిస్థితి ఇలా..

మెదక్ మున్సిపాలిటీలో 32 వార్డులుండగా, అందులో బీఆర్ఎస్ 18, కాంగ్రెస్ 9, బీజేపీ 3, ఎంఐఎం 1, స్వతంత్ర అభ్యర్థి ఒక చోట గెలుపొందారు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు తొడుపునూరి చంద్రపాల్‌ను చైర్మన్‌గా, మల్లిఖార్జున్‌గౌడ్ వైస్‌చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ నుంచి పలువురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరారు. అప్పట్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఇద్దరు మాత్రమే మిగిలారు. బీజేపీలో ఓ మహిళా కౌన్సిలర్ మినహాయిస్తే మొత్తం బీఆర్ఎస్ హవా కొనసాగింది.

గులాబీ నేతలపై ఎమ్మెల్యే గురి

14వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ దొంతి లక్ష్మి, బీఆర్ఎస్‌కు చెందిన 28వ వార్డు కౌన్సిలర్ మమతాప్రవీణ్‌గౌడ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. ఎన్నికల అనంతరం మైనంపల్లి రోహిత్‌రావు మెదక్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో వరసగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇటీవల కౌన్సిలర్లు కళ్యాణి, జయశ్రీ, వసంత్‌రాజ్(చిన్నా) కాంగ్రెస్‌లో చేరారు. అదే బాటలో మరో ఐదారుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు జరుపుతున్నారు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను 4వ వార్డు కౌన్సిలర్ నర్మద భర్త శ్రీధర్‌యాదవ్, 6వ వార్డు కౌన్సిలర్ రాగి వనజ భర్త అశోక్, 11వ వార్డు కౌన్సిలర్ సమీయొద్దీన్, 29వ వార్డు కౌన్సిలర్ రుక్మిణి భర్త కృష్ణ, 32వ వార్డు కౌన్సిలర్ మానస భర్త గోదల సాయిరాం కలిసి సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. వీరే కాకుండా మరి కొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరేందు కు రాయబారాలు జరుపుతున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. కాగా గతంలో బీజేపీని వీడిన ఇద్దరు కౌన్సిలర్లు తిరిగి సొంత గూటికి చేరుతారని వారి సన్నిహితుల ద్వారా తెలిసింది.

'అవిశ్వాసం' అనుమానమే..

మున్సిపల్ పాలకవర్గం గడువు మరో తొమ్మిది నెలల్లోనే ముగుస్తుంది. మెజార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరుకున్నా చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టకపోవచ్చని రాజకీయవర్గాలు విశ్లేస్తున్నాయి. క్యాంపు రాజకీయాలు నిర్వహించడం వ్యయంతో కూడుకున్నది కావడంతో వెనుకంజ వేసే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితుల్లో చైర్మన్ కూడా కాంగ్రెస్ గూటికి చేరే అవకాశం లేకపోలేదని వినికిడి. గతంలో దశాబ్దాల పాటు ఆయన కాంగ్రెస్‌లోనే పనిచేశారు. ఎమ్మెల్యే ఫోకస్‌తో మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.